క్లుప్తంగా

డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు చెల్లించాలి

రుద్రూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండిగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ లబ్ధిదారులు కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ఆందోళన చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని ప్రధాన రోడ్డుపై బైటాయించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు రావడం లేదని నిరసన తెలిపారు. తాము నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించి వెంటనే బిల్లులు ఇవ్వాలని నినాదాలు చేశారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి



రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోటగిరి మండల దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ ప్రభాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కన్వీనర్ కుర్లం సాయిలు, కో కన్వీనర్ బారిశెట్టి సాయిలు, వేదిక నాయకులు కొండాబాయి, ఫారూఖ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిలో పుష్పాలంకరణ



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజయసాయి పాఠశాలలో బుధవారం పుష్పాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పుష్పాలతోపాటు వివిధ రకాల ఆకులను ఉపయోగించి రూపొందించిన కళాకృతులను ఉపాధ్యాయులు పరిశీలించారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోన్ని సృజనాత్మకతను వెలికితీయడంలో భాగంగానే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రకృతితోపాటు వాటి అందాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్మస్ టోర్నీ ప్రారంభం



మాక్లూర్: మండలంలోని మెట్టులో 37వ క్రిస్మస్ ఫెస్టివల్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. పాస్టర్లు రూబేన్, ఇమ్మాన్యుయేల్, సల్మాన్‌రాజ్ ప్రారంభించారు. మొదటిరోజు 22 టీములు పాల్గొన్నాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రతి ఏడాది నిర్వహించే క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ప్రసాద్ తెలిపారు. మొదటి రెండురోజులు ఫుట్‌బాల్, మిగితా మూడు రోజులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, క్యారం, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఈనెల 31న బహుమతులు అందజేస్తామన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కమ్మర్‌పల్లి : జగిత్యాల జిల్లాలో నిర్వహించిన నాల్గో తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2023లో కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. టి రక్షిత, ఎల్ భవాని కరాటే పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. మెడల్స్‌తోపాటు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

వికసిత్ భారత్‌పై అవగాహన



బాల్కొండ: వికసిత్ భారత్‌పై మండలంలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వికసిత్ భారత్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు వనజ, చిన్నయ్య, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ల పన్ను వసూలయ్యేనా?

- సంవత్సరాలుగా చెల్లింపులు లేవు
- కేవలం జీపీ అనుమతులతో టవర్ల ఏర్పాటు
- అనుమతులు లేకుండా మరికొన్ని..
- ఆదాయం కోల్పోతున్న గ్రామపంచాయతీలు
- పట్టించుకోని అధికారులు!



నందిపేట్‌లో ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ టవర్లు

నందిపేట్(ఆర్మూర్): కోట్లాది రూపాయల వ్యాపారం చేసే సెల్‌ఫోన్ కంపెనీలు.. టవర్లను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఏడాదికోసారి చెల్లించాల్సిన పన్నును ఎగ్గొడుతున్నాయి. నందిపేట మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పలు కంపెనీలకు చెందిన సుమారు 50 సెల్‌టవర్లు ఉన్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వాటికి సంబంధించిన పన్ను వసూలు కావడం లేదు. ఇంటి పన్నును నిక్కచ్చిగా వసూలు చేసే సిబ్బంది సెల్‌టవర్లకు సంబంధించిన పన్ను వసూలుకు ఎందుకు ప్రయత్నించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని గ్రామ పంచాయతీలు ఏడాదికి సుమారు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల ఆదాయం కోల్పోతున్నాయి. మండల కేంద్రంలోనే పది సెల్‌టవర్లు ఉన్నాయి, ఆయా కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకుని ఒక్క టవరుకే వేర్వేరు కంపెనీలకు చెందిన పరికరాలను అమర్చి రూ. కోట్లలో వ్యాపారం చేస్తున్నాయి. టవర్‌తోపాటు జనరేటర్, గది నిర్మాణం అంతా కలిపి సుమారు సుమారు 300 నుంచి 400 గజాల స్థలంలో ఉన్నాయి. మండల కేంద్రంలోనే గ్రామ పంచాయతీ ఒక్కో టవర్‌కు సంబంధించి ఏడాదికి సుమారు రూ.30వేల వరకు ఆదాయం కోల్పోతున్నది.

అనుమతులతోపాటు రూ.10 వేలు

సెల్ టవర్ నిర్మాణానికి ముందు స్థలానికి సంబంధించిన పత్రాలతోపాటు గ్రామపంచాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ పంచాయతీ సెల్ టవర్ నుంచి పంచాయతీకి రూ.10 వేల రుసుము కట్టించుకోవాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లించగానే రసీదు ఇచ్చి అక్కడున్న విస్తీర్ణాన్ని బట్టి ఏడాదికి ఎంత పన్ను అనేది అప్పుడే గుర్తించి, ప్రతి ఏడాది పన్ను కట్టించుకోవాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. సెల్ టవరుకు స్థలాన్ని అద్దె ఇచ్చేవారు గ్రామపంచాయతీ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని అనుమతి పొందుతున్నారు. కొన్ని టవర్లను అమతులు లేకుండానే ఏర్పాటు చేశారు.

వసూలు చేస్తాం

టవర్లు ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామపంచాయతీకి కట్టాల్సిన బకాయిలను వసూలు చేస్తాం. అంతేకాకుండా డిమాండ్ రిజిస్టర్లలో పొందుపరిచి ప్రతి ఏడాది బకాయిల జాబితాలో టవర్ల బకాయిలు కనపడేలా చర్యలు తీసుకుంటాం. – సంబారు వాణి, సర్పంచ్, నందిపేట్

ఆదాయం పెరుగుతుంది

సెల్‌టవర్ల బకాయిలు వసూలు చేసేలా పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. పన్ను వసూలు అయ్యేలా చర్యలు తీసుకుంటాం, సెల్ టవర్ల పన్ను వసూలుతో పంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుంది.

– సౌమ్య, పంచాయతీ కార్యదర్శి, నందిపేట్

ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన మిషన్ భగీరథ నీటిని అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు రాకుండా, తమ స్థానంలో ప్రైవేట్‌సిబ్బందిని నియమించారన్నారు. గ్రామాలకు వచ్చి నీటి సరఫరా తీరును పర్యవేక్షించలేదని మండిపడ్డారు. అలసత్వం పనికి రాదని, నీటి నమూనాలను సేకరించి స్వచ్ఛమైన నీటిని అందించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, నారాయణ చౌదరి, మస్తాన్, మంగలి నవీన్, రత్నాకర్‌రెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్, ఫరాన్, ఇస్మాయిల్‌ఖాన్ తదితరులున్నారు.

సీఎంపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్

ఆర్మూర్‌టౌన్: గత పాలకుల హయాంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అధికారులను బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించడం సబబు కాదన్నారు. నిత్యం పత్రికల్లో, టీవీల్లో రాకేశ్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకోనే ప్రసక్తే లేదన్నారు. మాజిద్, ఆసిఫ్, జిమ్మి రవి, అజ్జు, శంకర్, కిషన్ పాల్గొన్నారు.

ప్రజలు లేకుండానే ప్రజావేదిక



ప్రజావేదికకు హాజరైన అధికారులు



పాల్గొన్న అధికారులు, సిబ్బంది

బాల్కొండ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈజీఎస్ ప్రజావేదికను బుధవారం నిర్వహించారు. ప్రజలు లేకుండానే ప్రజావేదిక కొనసాగింది. అధికారులు, సిబ్బంది నివేదికలను చదివి ముగించారు. డీఆర్డీవో చందర్‌నాయక్ మట్లాడుతూ.. గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి, పలు లోపాలను, తప్పులను గుర్తించినట్లు తెలిపారు. ప్రధానంగా జాబ్ కార్డు అప్‌లోడ్ చేయడం, హాజరు యాప్ ద్వారా అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యాన్ని గుర్తించారన్నారు. భవిష్యత్‌లో తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈజీఎస్ సామాజిక తనిఖీ అనేది ఓ తంతులా కొనసాగడంపై స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఎంపీపీ లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, సర్పంచ్ బూప సునీత, ఏపీవో ఇందిర, ఎఫ్‌ఏలు, టీఏలు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములు కోల్పోతాం



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆర్మూర్‌టౌన్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామం చుట్టూ బైపాస్‌రోడ్డు వేస్తే 150 ఎకరాల వ్యవసాయ భూములను కోల్పోతామని ఆర్డీవో వినోద్‌కుమార్‌కు బాధిత రైతులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 63వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంక్సాపూర్ గ్రామం మధ్యలో నుంచి రోడ్డు వేస్తామని మొదటి నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా వేయాలన్నారు. బైపాస్ రోడ్డు వేస్తే వ్యవసాయంపై ఆధారపడిన తాము నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బషీరాబాద్‌లో వైభవంగా మల్లన్న పల్లకీసేవ

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్‌లో కుర్మ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్నస్వామి జాతరోత్సవాల్లో భాగంగా బుధవారం పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘ భవనం నుంచి స్వామి వారి మూర్తిని పల్లకీలో మంగళహారతులు, డప్పుల చప్పుడుతో వీధుల గుండా ఊరేగించారు. అనంతరం దూలగుట్టపై ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో పల్లకీకి స్వాగతం పలికారు. పెద్ద ముత్తెన్న, రాజు, మల్కన్న, దేవన్న, సాగర్, సంపత్, చిన్నయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు సర్వం సిద్ధం

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- దిశానిర్దేశం చేసిన ఉన్నతాధికారులు



మాక్లూర్‌లో మాట్లాడుతున్న అధికారి ముత్తెన్న



వేల్పూర్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోవింద్



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

సాక్షి నెట్‌వర్క్: ప్రజాపాలనకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి (గురువారం)నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉన్నతాధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ఆయాశాఖల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలకు కేటాయించిన తేదీల వారీగా దరఖాస్తుల స్వీకరణ కోసం గ్రామసభలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులను సూచించారు. ప్రభుత్వ సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి 12 వరకు అనంతరం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వంద ఇండ్లకు ఒక కౌంటరు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ.. దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



రెంజల్‌లో మాట్లాడుతున్న అధికారి వాజీద్‌హుస్సేన్



రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలగంగాధర్



నందిపేట్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగవర్ధన్



సమస్యల పరిష్కారానికే..

- అధికారులదే కీలక పాత్ర
- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



హాజరైన అధికారులు, ఆయాశాఖల ఉద్యోగులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులదే కీలకపాత్ర అని, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అధికారులు, ఉద్యోగులతో నియోజకవర్గస్థాయి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో గ్రామసభలు కొనసాగుతాయన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా దరఖాస్తు స్వీకరణ కౌంటర్లు ఉంటే సౌలభ్యంగా ఉంటుందన్నారు. తొలి విడుతగా సొంత స్థలాలున్న అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ.. ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరించే క్రమంలో ప్రజలతో ఆప్యాయంగా మెలగాలని అధికారులకు సూచించారు. బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ కిరణ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతుబంధు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

ఎడపల్లి(బోధన్): యాసంగి వరినాట్లు ప్రారంభమవుతున్నప్పటికీ రైతుబంధు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ అన్నారు. మండలంలోని అభంగపట్నంలో బుధవారం గ్రామకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. నాయకులు హన్మాండ్లు, సుదర్శన్, కొండెంగల గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సేవే పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చా



ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్లు

పెర్కిట్(ఆర్మూర్): ప్రజాసేవే పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో పాస్టర్లు బుధవారం ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యేను సన్మానించారు. పాస్టర్స్ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు అగస్టీన్, కోశాధికారి షడ్రక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం సంపూర్ణమయ్యాయి. చివరి రోజు స్వామి వారికి చక్రతీర్థ పుష్పయాగం, నాగవెల్లి, డోలోత్సవం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్తులకు అన్నదానం చేశారు. వీడీసీ అధ్యక్షుడు బద్దం గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు రూపాల ధర్మాజీ, కార్యదర్శి మేకల శేఖర్, బాలయ్య, శ్రీధర్, విక్రమ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఆక్వామెన్-2(ఇంగ్లీష్-2డీ)- 10.00, 7.15
హాయ్‌నాన్న(తెలుగు)- 12.45, 4.00
యానిమల్ (హిందీ)- 10.00

స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 08.30, 11.35, 3.10, 6.45, 10.20

స్క్రీన్-3 – సలార్ (తెలుగు) - 8.30, 12.05, 3.40, 7.15, 10.50

స్క్రీన్-4 – సలార్ (తెలుగు) - 8.45
డంకీ (హిందీ) - 12.20, 3.40, 7.00, 10.20

అక్షింతల శోభాయాత్ర



ఎడపల్లి (బోధన్) : అయోధ్య శ్రీరాములవారి పూజిత అక్షింతల శోభాయాత్రను ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు మంగళ హారతులతో శోభాయాత్రకు స్వాగతం పలికారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో అయ్యప్ప స్వామి సేవాసమితి, వీడీసీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన బుధవారం పూజా కార్యక్రమాలను అవధూత దత్తపీఠం ఆస్థాన విద్వాంసులు, చండీ ఉపాసకులు కొడకండ్ల శ్రీరామ శరణ్‌శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వాములు నగేశ్‌శర్మ, భూవనేశ్వరయ్య, వినోద్, పవన్, తిరుపతిరెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మండల పూజ, ఆరట్టు ఉత్సవం

బోధన్‌టౌన్/వర్ని/బాల్కొండ: బోధన్ పట్టణంతో పాటు వర్నిలో అయ్యప్ప మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వర్నిలో నిర్వహించిన మండల పూజలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మాలధారులకు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్‌లో ఆరట్టు ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన వీధుల్లో శోభాయాత్ర కొనసాగింది.

ప్రభుత్వ భూమిని కాపాడండి



బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామపరిధిలో చిట్టాపూర్ వరకు రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా కాపాడాలని పలువురు గ్రామస్తులు తహసీల్దార్ శ్రీధర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామ పంచాయతీ అక్రమంగా విక్రయించిందన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోశారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కా కుండా అడ్డుకోవాలని కోరారు. కుమ్మరి గంగాధర్, రాజేశ్వర్, కూనల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.